క్లుప్తంగా

నియామకం



నియామకపత్రం అందిస్తున్న శంకర్

మందమర్రిరూరల్: జాతీయ బీసీ సంక్షేమ సంఘం మందమర్రి పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బేర వేణుగోపాల్‌రావును నియమించారు. సంఘం పట్టణ అధ్యక్షుడు సకినాల శంకర్ ఆదివారం నియామక పత్రం అందించారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి సతీష్‌బాబు, ఉపాధ్యక్షుడు ప్రభాకర్, శివరామకృష్ణ, రామ్‌చందర్, కుమార్, వేణు, రాజు, నర్సోజీ, సంతోష్ తదితరులున్నారు.

'గోదావరి తీరాల్లో గణేశ్ నిమజ్జనం లేదు'

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల పరిధిలోని గోదావరి తీర ప్రాంతాల్లో ఈ ఏడాది గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి అనుమతి లేదని హాజీపూర్ తహసీల్దార్ శ్రీనివాసరావుదేశ్‌పాండే, ఎంపీడీవో మధుసూదన్, ఎస్సై గోపతి సురేశ్ ఆదివారం తెలిపారు. మండలంలోని గణేశ్ మండపాల నిర్వాహకులు గణేశ్ నిమజ్జనం కోసం విగ్రహాలను దండేపల్లి మండలం గూడెం గోదావరి, జైపూర్ మండలం ఇందారం గోదావరి బ్రిడ్జ్, మంచిర్యాల గోదావరి తీరానికి కానీ తరలించి అక్కడే నిమజ్జనం చేయాలన్నారు.

ఉచిత వైద్య శిబిరం



జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్‌నగర్ కాలనీలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని 7వ వార్డు ఎన్టీఆర్ నగర్ కాలనీలో ఆదివారం శ్రీభగవద్గీత అధ్యయన మండలి వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. చెస్ట్ ఫిజీషియన్ డాక్టర్ కె.రాకేశ్ రెడ్డి, డీహెచ్‌ఎంఎస్ డాక్టర్ సుగుణాకర్ రెడ్డి, ఎండీ డాక్టర్ కృష్ణ, డాక్టర్ సునిల్ కుమార్ ఆరోగ్య పరీక్షలను నిర్వహించి, మందులు అందించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ ప్రకాశ్ నాయక్, ప్రజలు పాల్గొన్నారు.

పరామర్శ



నివాళులర్పిస్తున్న ఎంపీ వంశీ

నెన్నెల: మండలంలోని కుశ్నపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ మాజీ సర్పంచ్ సంధ్య-మహేష్‌రెడ్డి మామ మల్లారెడ్డి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ ఆదివారం మహేష్‌రెడ్డి స్వగృహానికి వెళ్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గట్టు మల్లేష్, గొల్లపల్లి మాజీ ఎంపీటీసీ హరీష్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు తోట శ్రీనివాస్, నర్సింగరావు, మల్లాగౌడ్ ఉన్నారు.

ఘనంగా ఇంజినీర్స్ డే



సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి సింగరేణి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని ఆదివారం ఇంజినీర్స్ డే ఘనంగా నిర్వహించారు. స్థానికంగా నిర్వహించిన కార్యక్రమంలో ఇంజినీర్లను సన్మానించారు. మందమర్రి మున్సిపల్ ఇంజినీర్(ఏఈ) ఎ.అచ్యుత్, రిటైర్డు జూనియర్ ఇంజినీర్ టి.వెంకటేశ్వరరావులకు సింగరేణి లయన్స్‌క్లబ్ నిర్వాహకులు శాలువా కప్పి సత్కారం చేశారు. ఈ సందర్భంగా సింగరేణి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కొంకటి అంజయ్య మాట్లాడుతూ.. ప్రాజెక్టులు ఇతర రంగాల నిర్మాణంలో ఇంజినీర్ల పాత్ర మరిచి పోలేనిదన్నారు. మేకింగ్ ఇండియా అభివృద్ధి సాధించడానికి, ఇంజినీర్లు చేస్తున్న కృషి ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సెక్రెటరీ వంగల చక్రపాణి, నిర్వాహకులు వేణుగోపాల్, పెద్దిరాజు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలో లయన్స్ క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం ఇంజనీర్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్, లయన్స్‌క్లబ్ గోల్డెన్ జూబ్లీ సభ్యులు ఇంజినీర్‌లను సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రోగ్రాం చైర్‌పర్సన్ మధుసూధన్‌రెడ్డి, మంచిర్యాల శాఖ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బాలమోహన్, లయన్స్ క్లబ్ గోల్డెన్ జూబ్లీ అధ్యక్షుడు రాకేశ్‌రెడ్డి, డిస్ట్రిక్ట్ క్యాబినెట్ సెక్రెటరీ వాలెట్ శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.

గణపయ్యా.. దీవించయ్యా..!

- వినాయకుడికి ప్రత్యేక పూజలు
- నైవేద్యం సమర్పించి మొక్కులు
- కుంకుమపూజలు, అన్నదానాలు నిర్వహిస్తున్న భక్తులు



భీమారం: పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నెలకొల్పిన వినాయకుడి వద్ద కుంకుమపూజలు

జన్నారం/దండేపల్లి/మందమర్రిరూరల్/లక్సెట్టిపేట: గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా వినాయకుడు ప్రత్యేక పూజలందుకుంటున్నాడు. భక్తులు నైవేద్యాలు సమర్పిస్తూ మొక్కులు తీర్చుకుంటున్నారు. అన్నదానాలు, కుంకుమ పూజలు, శ్రీ లక్ష్మీ గణపతి హోమాలు నిర్వహిస్తున్నారు. వినాయకా మమ్ము దీవించు అని వేడుకుంటున్నారు. జన్నారం మండలం పొన్కల్ జీపీ పరిధిలోని గొల్ల గూడెం గణేశ్ మండపం వద్ద ఆదివారం వేదపండితులు గుండి నరహరిశర్మ ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీ గణపతి హోమం ఘనంగా నిర్వహించారు. దండేపల్లి బాలగణేశ్ మండలి వద్ద నిర్వహించిన కుంకుమ పూజల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. అనంతరం అన్నదానాలు చేశారు. మందమర్రి జీఎం ఆఫీస్ ఏరియాలోని గణేష్ మండపం వద్ద ప్రత్యేకపూజ కార్యక్రమంతో పాటు హోమ కార్యక్రమం నిర్వహించారు. లక్సెట్టిపేట కోర్టు రోడ్‌లో శివ గణేశ్ భక్త మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక మండపం వద్ద ముస్లిం మైనార్టీల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పట్టణ సీఐ నరేందర్ హాజరై కులమతాలకు అతీతంగా సోదరభావంతో గణేశ్ నిమజ్జనాలు నిర్వహించుకోవాలని, ప్రతి ఒక్కరూ కలిసిమెలిసి ఉండాలన్నారు.

భీమారం: భీమారం మండల కేంద్రంలో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద కుంకుమ పూజలు నిర్వహించారు. జెడ్పీ హైస్కూల్ వీధిలోని ఫ్రెండ్స్ యూత్ గణేశ్ మండలి వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్‌లోని ఏజోన్ ఏరియాలోని బ్లూమూన్ యూత్ గణేష్ మండలి ఆధ్వర్యంలో కుంకుమ పూజ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): నంనూర్ శ్రీలక్ష్మీ గణేశ్ మండలి ఆధ్వర్యంలో అన్నప్రసాదాన్ని ప్యాకెట్లుగా తయారు చేసి, మంచిర్యాల రైల్వేస్టేషన్, బస్టాండ్, ప్రభుత్వ ఆస్పత్రుల్లో 200మంది వరకు నీటి బాటిళ్లతో పాటుగా అందజేశారు.

భీమిని: కన్నెపల్లి మండలంలోని జన్కాపూర్‌లోని శ్రీ వరసిద్ధి వినాయక మండపాల వద్ద భక్తులు రంగవల్లులు వేసి దీపాలంకారణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తి పాటలకు కోలటాలు వేస్తూ నృత్యం చేశారు.

వేమనపల్లి: వేమనపల్లి మండల కేంద్రంలో వేమన యూత్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమంలో మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు వేణుమాధవ్, మండల పీఏసీఎస్ చైర్మన్ వెంకటేష్ పాల్గొన్నారు.



భీమారం ఫ్రెండ్స్ గణేశ్ మండలి వద్ద...



దండేపల్లి: కుంకుమ పూజల్లో మహిళలు



మందమర్రిరూరల్: హోమంలో దంపతులు



జన్కాపూర్‌లో దీపాలంకారణ



లక్సెట్టిపేట: పూజలో పాల్గొన్న ముస్లింలు



జన్నారం: లక్ష్మీగణపతి హోమంలో భక్తులు



ఆరెస్పీలో కుంకుమ పూజల్లో పాల్గొన్న భక్తులు



మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో అన్నప్రసాదం పంపిణీ చేస్తున్న సభ్యులు

ఉత్సాహంగా బీజేపీ సభ్యత్వ నమోదు

బెల్లంపల్లి: మున్సిపాలిటీలో బీజేపీ సభ్యత్వ నమోదును ఆదివారం ఉత్సాహ వాతావరణంలో నిర్వహించారు. మున్సిపాలిటీలోని 46, 53పోలింగ్ బూత్‌లలో పుర ప్రజలతో సభ్యత్వం చేయించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు, దేశ రక్షణకు తీసుకుంటున్న చర్యలు వివరిస్తూ ఇంటింటా తిరుగుతూ సభ్యత్వం చేయించారు. షాపుల నిర్వాహకులు, యువకులు, మహిళలు ముందుకొచ్చి బీజేపీ సభ్యత్వం స్వీకరించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షురాలు దార కళ్యాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వెంకట కృష్ణ, జిల్లా కన్వీనర్ మాసు రజని, బీజేపీ బెల్లంపల్లి అసెంబ్లీ కన్వీనర్ రాచర్ల సంతోష్, పట్టణ ఉపాధ్యక్షుడు గంధం అనిల్, కార్యదర్శి సల్లం సుమలత, శ్రేణులు శ్రీనివాస్, ప్రశాంత్, రాము తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ దేశహితం కోసం పనిచేసే పార్టీ'

వేమనపల్లి: బీజేపీ దేశహితం కోసం పనిచేసే ఏకైక పార్టీ అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ అన్నారు. వేమనపల్లి మండల కేంద్రంలో ఆదివారం బీజేపీ సభ్యత్వ నమోదులో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మధుకర్, ప్రధాన కార్యదర్శి వెంకటి, నాయకులు శ్రీకాంత్, ఎల్లయ్య, మధునయ్య, గోపాల్, పుల్లయ్య, రాజన్న పాల్గొన్నారు.

అవగాహన సదస్సు

మంచిర్యాలటౌన్: విద్యార్థులు ఆత్మస్థైర్యంను పెంపొందించుకొని, ఎలాంటి సమస్యలు ఉత్పన్నమైనా వాటిని అధిగమించాలని తెలంగాణ సైకాలజిస్టు అసోసియేషన్(టిపిఏ) మంచిర్యాల జిల్లా శాఖ సభ్యులు అన్నారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్ నగర్ కేజీబీవీలో ప్రపంచ ఆత్మహత్యల నివారణ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు ఆదివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పోకల వెంకటేశ్వర్లు, అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపతి నారాయణరావు, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ స్వప్న, టీపీఏ మహిళా అధ్యక్షురాలు డాక్టర్ సుమనా చైతన్య, సైకాలజిస్టులు సుమన్, కోటేశ్వర్ రెడ్డి, జ్యోతి పాల్గొన్నారు.

ఏచూరి మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటు



బెల్లంపల్లి: శ్రద్ధాంజలి ఘటిస్తున్న నాయకులు



పాతమంచిర్యాల: నివాళులర్పిస్తున్న నాయకులు

పాతమంచిర్యాల/బెల్లంపల్లి: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అకాల మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. బెల్లంపల్లి పట్టణ సీపీఎం కార్యాలయంలో ఆదివారం ఏచూరి చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నాగరాజ్‌గోపాల్, రమణ, రాజారాం, దేవదాస్, సంకీర్తన్, తాజ్‌బాబా, రవీందర్, సజీవన్, తదితరులు పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని చార్వాక ట్రస్టు భవనంలో దివంగత సీతారాం ఏచూరీ సంతాప సభ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య, సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి సంకె రవి, కార్యదర్శి వర్గ సభ్యులు ప్రకాష్, నాయకులు పాల్గొన్నారు.

'సాయుధ పోరాట చరిత్ర పుస్తకాల్లో చేర్చాలి'

నస్పూర్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు లింగం రవి డిమాండ్ చేశారు. నస్పూర్ కాలనీలో లింగం రవి జెండాను ఆవిష్కరించగా తాళ్లపల్లిలో మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, నస్పూర్ షిర్కే కాలనీలో మిర్యాల రాజేశ్వర్‌రావు జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కారుకూరి నగేశ్, జిల్లా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాన్ని ఆదివారం సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జెండా ఆవిష్కరించారు. పార్టీ జిల్లా, పట్టణ కార్యదర్శులు రామడుగు లక్ష్మణ్, మిట్టపల్లి శ్రీనివాస్ మాట్లాడారు. తెలంగాణ కోసం ఆనాడు అసలుసిసలైన పోరాటాలు సాగించిన అమరవీరులకు నివాళులర్పిస్తూ వారిని స్మరించుకునేందుకు సాయుధ పోరాట దినాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని పలు ప్రధానకూడళ్లలోనూ జెండా ఆవిష్కరణలు చేశారు. కార్యక్రమంలో నాయకులు మిట్టపెల్లి పౌల్, నక్క వెంకటస్వామి, పెరక సంపత్, అన్నం శ్రీనివాస్, మల్లేష్, గోపి పాల్గొన్నారు.



రామకృష్ణాపూర్‌లో జెండా ఆవిష్కరిస్తున్న లక్ష్మణ్

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండలంలో సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. మాల గురిజాల, రంగపేట గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సీపీఐ జిల్లా సమితి సభ్యులు మేకల రాజేశం, సీపీఐ మండల కార్యదర్శి బొంతల లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా హాజరై ఎర్ర జెండాను ఎగురవేశారు. ఆయా కార్యక్రమాల్లో సీపీఐ పార్టీ గురిజాల, రంగపేట శాఖ కార్యదర్శులు గోమాస గంగారాం, సురేందర్, నాయకులు పాల్గొన్నారు.

ఫొటో, వీడియో జర్నలిస్టుల సమస్యలపై దృష్టి

మంచిర్యాలటౌన్: జిల్లాలోని ఫొటో, వీడియో జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించేందుకు గాను ఆయా సమస్యలపై దృష్టిసారించి, వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని నూతనంగా ఎన్నుకోబడిన వీడియో ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కొత్తపల్లి సతీశ్, మాదర బోయిన శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం మంచిర్యాల జిల్లా ఫొటో అండ్ వీడియో జర్నలిస్టు అసోసియేషన్ ఎన్నికలను నిర్వహించి, నూతన కార్యవర్గాన్ని ఓటింగ్ ద్వారా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా ఎల్లబెల్లి శ్రీకాంత్, కోశాధికారిగా మారం రఘు, ప్రచార కార్యదర్శిగా నరెడ్ల రాము, గౌరవ అధ్యక్షుడిగా ఈసంపల్లి రమేశ్, 10మందికి ఎగ్జిక్యూటివ్ మెంబర్లను సభ్యులుగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా జుట్టు రమేశ్, అనుమాండ్ల శ్రీనివాస్, ఈసంపల్లి రమేశ్ వ్యవహరించారు.



నూతన కార్యవర్గ సభ్యులు



గణపతి విగ్రహాలను నిమజ్జనానికి పడవ పై తీసుకెళ్తున్న జాలర్లు

వెళ్లిరా... వినాయకా

- పెద్ద చెరువు ఒడికి చేరిన లంబోదరుడు
- కనుల పండువగా గణేశ్ నిమజ్జన శోభాయాత్ర
- పూజలు చేసి నిమజ్జనాన్ని ప్రారంభించిన చైర్‌పర్సన్
- బందోబస్తు నిర్వహించిన పోలీసులు



పెద్ద చెరువు వద్ద పూజలు చేస్తున్న చైర్‌పర్సన్

చెన్నూర్: చెన్నూర్ మున్సిపాలిటీలో గణేశ్ నిమజ్జన శోభాయాత్ర కనుల పండువగా సాగింది. గణేశ్ నవరాత్రి వేడుకలను అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్న భక్తులు ఆదివారం గణనాథుల నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ, అయ్యప్పస్వామి గణేశ్ మండళ్ల వద్ద లడ్డూ వేలం నిర్వహించగా విశ్వకర్మ కాలనీలో ఏర్పాటు చేసిన శ్రీకృష్ణ గణేశ్ మండలి లడ్డూను రవీందర్‌రెడ్డి రూ.10,800కు దక్కించుకోగా, అయ్యప్పస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన శివసాయి గణేశ్ మండలి లడ్డూను కొల్లూరి సమ్మయ్య రూ.12,500లకు దక్కించుకున్నారు. అనంతరం మహిళల మంగళహారతులు, చిన్నారుల, యువకుల నృత్యాల మధ్య పెద్ద చెరువు ఒడిలోకి చేరారు. ముందుగా ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ గణనాథుడి నిమజ్జన కార్యక్రమం మధ్యాహ్నమే పూర్తి అయ్యింది. రాత్రి పెద్ద చెరువు వద్ద మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చనరాంలాల్‌గిల్డా, పాలకవర్గ సభ్యులు వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజలు చేసి నిమజ్జనాన్ని ప్రారంభించారు. గాంధీచౌక్‌లో మున్సిపాలిటీ, గణేశ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో గణనాథులకు స్వాగతం పలికారు. బ్రాహ్మణవాడ, బడా హనుమాన్, శోమేశ్వరా, మహంకాళివాడ, బట్టిగూడెం, పద్మశాలీవాడ, మర్వాడీ యువమంచ్, అయ్యప్ప స్వామి, ఆదర్శనగర్, గోదావరి రోడ్డు, ఎమ్మెల్యే కాలనీ, చింతలగూడెం, ప్రతాప్ మారుతీ హనుమాన్ మందిర్ గణనాథులు పెద్ద చెరువులో నిమజ్జనానికి తరలివచ్చాయి. నిమజ్జన కార్యక్రమం సోమవారం ఉదయం వరకు కొనసాగే అవకాశాలున్నాయి.

భారీ బందోబస్తు..

గణేశ్ నిమజ్జనంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చెన్నూర్ సీఐ రవీందర్, కోటపల్లి సీఐ సుధాకర్, మంచిర్యాల రూరల్ సీఐ నరేశ్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. నిమజ్జన కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజ్, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు బెల్లంపల్లి రాజగౌడ్, నడిపల్లి లక్ష్మణ్‌రావు, బెల్లంకొండ జనార్దన్‌రావు, కౌన్సిలర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇప్ప రాజ్‌కుమార్ పాల్గొన్నారు. గణేశ్ నిమజ్జనాన్ని మంచిర్యాల డీసీపీ భాస్కర్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ పరిశీలించారు. గాంధీ చౌక్‌లో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేదికపై ఆశీనులై శోభాయాత్రలను తిలకించారు. నిమజ్జన ఘాట్‌ను సందర్శించి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ రవీందర్, కోటపల్లి సీఐ సుధాకర్, మంచిర్యాల రూరల్ సీఐ నరేశ్, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో...

బబ్బరుచెల్కలో నిమజ్జన వేడుకలు

కోటపల్లి: మండలంలోని బబ్బరుచెల్క గ్రామంలో కాంగ్రెస్ నాయకుడు గంగుల సీతారాంరెడ్డి ఆధ్వర్యంలో నిమజ్జన వేడుకలు ఘనంగా జరిగాయి. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



బ్రాహ్మణ గణేశ్ మండలి గణేశ్ శోభాయాత్ర



రిమోట్ కారులో తరలిన బుజ్జి గణనాథుడు



నిమజ్జనం చేస్తున్న జాలర్లు

సంక్షిప్త వార్తలు

మంత్రుల కమిటీని వెంటనే ఉపసంహరించుకోవాలి

నస్పూర్: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ అమలుకు ప్రభుత్వం నియమించిన మంత్రుల కమిటీని వెంటనే ఉపసంహరించుకోవాలని జాతీయ మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలితం శంకర్ అన్నారు. శ్రీరాంపూర్ ఏరియాలోని విశ్వశాంతి పాఠశాల ఆవరణలో ఆదివారం మాలమహానాడు నస్పూర్ పట్టణ కమిటీ సమావేశం నిర్వహించారు.కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి గరిసె రామస్వామి, జై భీమ్ సైనిక్ దళ్ రాష్ట్ర కన్వీనర్ ఆసాది పురుషోత్తం, జిల్లా ఉపాధ్యక్షుడు జింజుపల్లి నర్సింగ్, నాయకులు పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు.

ఉపాధి పనులు కల్పించాలి

లక్సెట్టిపేట: ప్రభుత్వం ఉపాధి కూలీలకు పనులు కల్పించాలని తెలంగాణ అసంఘటిత కార్మిక బిడ్డల సంఘం రాష్ట్ర నాయకులు మేదరి దేవవరం అన్నారు. దౌడపల్లి గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఉపాధి కూలీ పనులు చాలా మందికి కల్పించడం లేదని మున్సిపాలిటీ, మండల పరిధిలో ప్రతి ఒక్కరికి కల్పించాలని కోరారు. భవన నిర్మాణ కార్మికులకు తగిన వేతనాలు అందజేయాలని తెలిపారు. అనంతరం భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. కార్యక్రమంలో మండల నాయకులు రమణారెడ్డి, దేవయ్య, బానుచందర్, రవికిరణ్ పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

లక్సెట్టిపేట: మండల కేంద్రంలో ఉన్నటువంటి ఐదు మసీదులలో సీసీ కెమెరాలను ఎస్సై సతీష్ ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేరాలను అదుపు చేయడంలో సీసీ కెమెరాలు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు వినియోగించుకోవాలని, ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తెలియజేయాలన్నారు. సీసీ కెమెరాల నిర్వహణ జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ముస్లింలు షాహిద్‌అలీ, నవాబ్‌ఖాన్, చాంద్, ఇర్ఫాన్, అజ్జు పాల్గొన్నారు.

పట్టణ అధ్యక్షుడిగా శివకుమార్

పాతమంచిర్యాల: జై భీమ్ సైనిక్‌దళ్ పట్టణ అధ్యక్షుడిగా దొంతమల్ల శివకుమార్‌ను నియమించినట్లు జై భీమ్ సైనిక్ దళ్ రాష్ట్ర అధ్యక్షుడు పురుషోత్తం తెలిపారు. జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన జైభీమ్ సైనిక్ దళ్ జిల్లా స్థాయి నాయకుల సమావేశంలో ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా నియామకపత్రాన్ని శివకుమార్‌కు అందించారు.